# సింహంతో ఆది చెలగాటం..





**ప్రస్తుతం బాలకృష్ణ** నటిస్తున్న 'అఖండ' సీక్వెల్ 'అఖండ తాండవం'పై ప్రేక్షకుల్లో అంచనాలు సామాన్యంగా లేవు. దానికి తగ్గట్టుగానే బాలయ్య కెరీర్‌లో ఇది తొలి పానిండియా సినిమా కావడం విశేషం. బోయపాటి శ్రీను దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్న ఈ చిత్రానికి బాలకృష్ణ కుమార్తె ఎం.తేజస్విని నందమూరి సమర్పకురాలిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో నటుడు ఆది పినిశెట్టి ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్నట్టు శనివారం మేకర్స్ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. 'సరైనోడు' సినిమాలో ఆదిని స్టైలిష్ విలన్‌గా ప్రజెంట్ చేశారు బోయపాటి. ఈ సినిమాలోని పాత్ర కూడా తన కెరీర్లో గుర్తుండిపోయేలా ఉంటుందని, ఇందులో ఆయన కొత్త లుక్‌లో కనిపిస్తారని, బాలకృష్ణ, ఆది పినిశెట్టి మధ్య జరిగే సన్నివేశాలు ప్రేక్షకులకు పూనకాలు తెప్పిస్తాయని బోయపాటి చెబుతున్నారు. హైదరాబాద్ అన్నపూర్ణ ఏడెకరాల్లో ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నది. రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో భారీ యాక్షన్ సన్నివేశాలను అక్కడ చిత్రీకరిస్తున్నారు. బాలకృష్ణ, ఆది పినిశెట్టి.. ఇద్దరూ ఈ షూట్‌లో పాల్గొంటున్నారు. సినిమాలో హైలైట్‌గా నిలిచే సన్నివేశంగా ఇది చెబుతున్నారు. సంయుక్త మీనన్ ఫిమేల్ లీడ్ పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సి.రాంప్రసాద్, సంతోష్ డి, సంగీతం: తమన్, నిర్మాణం: 14రీల్స్ ప్లస్.

# మజాకా నాకు గొప్ప అవకాశం



**'మన్మథుడు'** టైమ్‌కి నా వయసు 15ఏళ్లు. అప్పటికి అంత మెచ్యూరిటీ లేదు నాకు. 'మన్మథుడు' నా పాతికేళ్ల వయసులో చేసి వుంటే.. బహుశా సినిమాల్లోనే కొనసాగేదాన్నేమో.. 'రాఘవేంద్ర' తర్వాత లండన్ వెళ్లిపోయి అక్కడే మాస్టర్స్ పూర్తి చేశాను. సైకాలజిస్ట్ అయ్యాను. 24ఏళ్లకే పెళ్లి చేసుకున్నాను. నాకు ఇద్దరు పిల్లలు. బ్యూటిఫుల్ జర్నీ' అని తన గురించి చెప్పుకొచ్చింది కథానాయిక అన్షు. మన్మథుడు, రాఘవేంద్ర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ అందం.. దాదాపు 23ఏండ్ల విరామం తర్వాత 'మజాకా' చిత్రం ద్వారా తెరపై సాక్షాత్కరించనుంది. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 26న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో అన్షు విలేకరులతో ముచ్చటించింది. 'మజాకా' తనకు గొప్ప అవకాశమని, రైటర్ ప్రసన్న కథ చెబుతున్నప్పుడు బాగా ఎంజాయ్ చేశానని, కథలో తనది చాలా కీలకమైన హెవీ రోల్ అని, తప్పకుండా అందరికీ నచ్చుతుందని అన్షు నమ్మకం వెలిబుచ్చారు. 'నేను బ్రిటిష్ ఇండియన్. లండన్‌లోనే ఉంటున్నాను. అందుకే తెలుగు కాస్త కష్టమైంది. ఓ ట్యూటర్‌ని పెట్టుకొని తెలుగు నేర్చుకుంటున్నా. చిత్ర యూనిట్ కూడా ఈ విషయంలో నాకెంతో సపోర్ట్‌గా నిలిచారు. సందీప్‌కిషన్, రీతూవర్మ అయితే మంచి ఫ్రెండ్స్ అయిపోయారు. ఫ్యూచర్‌లో తెలుగులో మరిన్ని మంచి పాత్రలు చేయాలని ఉంది.' అని తెలిపింది అన్షు.



# మా జీవితాలు సార్థకమయ్యాయి

**'సినిమాకు** పనిచేసిన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. ఇది మీ అందరి ఎనర్జీ వల్ల వచ్చిన విజయం. మీ అందరూ కష్టపడి, ఫలితాన్ని మాత్రం నాకిచ్చారు. అయిదేళ్లు మా అందర్నీ బాగా చూసుకున్నందుకు నిర్మాతలకు థ్యాంక్స్. క్యూబా కెమెరా, దేవిశ్రీ సంగీతం ఈ సినిమాకు ప్రాణం. చీఫ్ టెక్నీషియన్స్ అందరూ ప్రాణం పెట్టారు. ఇక ప్రేక్షకులు ఈ సినిమాపై చూపించిన ప్రేమ మాటల్లో చెప్పలేను. మనం ఎంత కష్టపడ్డా.. అందరికీ హిట్ ఇచ్చేది దర్శకుడొక్కరే. ఈ సినిమాకు పనిచేసిన అందరం సుకుమార్‌కు థ్యాంక్స్ చెప్పాలి. ఈ విజయం ఆయనదే. పుష్ప ఫ్రాంచైజీ ద్వారా మా అందరి జీవితాలు సార్థకమయ్యాయ్. చివరిగా ఈ విజయాన్ని నా అభిమానులకు డెడికేట్ చేస్తున్నా. ' అని అల్లు అర్జున్ అన్నారు. ఆయన కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీమేకర్స్ నిర్మించిన చిత్రం 'పుష్ప2'. 'పుష్ప' చిత్రానికి సీక్వెల్‌గా వచ్చిన ఈ సినిమా ఆలిండియా రికార్డులను తిరగరాసింది. చిత్ర నిర్మాతలు నవీన్ యర్నేని, యలమంచిలి రవిశంకర్ ఈ చిత్రం థ్యాంక్స్ మీట్‌ని శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లు అర్జున్ మాట్లాడారు. సినిమాకు పనిచేసిన అందరికీ పేరుపేరున దర్శకుడు సుకుమార్ కృతజ్ఞతలు తెలియజేశారు. దేవిశ్రీప్రసాద్, బన్నీ వాసు, సునీల్, నవీన్ నూలి, ఎస్కేఎన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.

# బ్రహ్మానందం కోసం వచ్చి గౌతమ్‌ని తీసుకెళ్తారు



**'తాత,** మనవడి అనుబంధం నేపథ్యంలో ఈ కథ సాగుతుంది. ఎమోషన్స్‌తోపాటు ఎంటర్టైన్మెంట్ కూడా ఉంటుంది. మా తాత నన్నొక సక్సెస్‌ఫుల్ పర్సన్‌గా చూడాలనుకున్నారు. కానీ 'మళ్లీ రావా' టైమ్‌లోనే ఆయన కాలం చేశారు. ఆయనకు నివాళిగా ఈ సినిమా తీశా.' అని నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా అన్నారు. మళ్లీ రావా, ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ, మసూద చిత్రాలను నిర్మించారాయన. ఆయన ప్రొడక్షన్‌లో వస్తున్న నాల్గవ చిత్రం 'బ్రహ్మ ఆనందం'. పద్మశ్రీ బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రానికి ఆర్వీయస్ నిఖిల్ దర్శకుడు. ఈ నెల 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో ముచ్చటించారు. 'బ్రహ్మానందం అనే టైటిల్‌తోనే దర్శకుడు ఈ కథ రాశాడు. బ్రహ్మానందంగారికి కూడా కథ బాగా నచ్చి ఓకే చేశారు. ఇప్పటివరకూ చూడనటువంటి గొప్ప పాత్రలో ఇందులో బ్రహ్మానందం కనిస్తారు. మరో విషయం ఏంటంటే.. ఈ సినిమాకు అంతా బ్రహ్మానందం కోసం వస్తారు. కానీ ఇంటికెళ్లేటప్పుడు మాత్రం రాజా గౌతమ్‌ను తీసుకెళ్తారు. అంతబాగా చేశాడు తను. గౌతమ్‌తో మళ్లీ 'వైబ్' అనే సినిమా చేస్తున్నా. స్వరూప్ ఆర్ఎస్‌జె ఆ చిత్రానికి దర్శకుడు' అని తెలిపారు

# సిద్ధమవుతున్న త్రిబాణధారి




**సత్యరాజ్, వశిష్ట ఎన్.సింహా,** సాంచిరాయ్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న చిత్రం 'త్రిబాణధారి బార్బరిక్'. మోహన్ శ్రీవత్స దర్శకుడు. విజయపాల్‌రెడ్డి అడిదల నిర్మాత. అగ్ర దర్శకుడు మారుతి సమర్పకుడు. పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలోని 'నీవల్లే..' అంటూ సాగే గీతాన్ని మేకర్స్ శనివారం విడుదల చేశారు. రఘురాం రాసిన ఈ పాటకు ఇంఫ్యూజన్ బ్యాండ్ స్వరపరచగా సిద్ శ్రీరామ్ ఆలపించారు. యూత్‌కి కనెక్ట్ అయ్యేలా ఈ పాట సాగింది. ఉదయభాను, సత్యం రాజేష్, వీటీవీ గణేష్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కుశేందర్ రమేష్‌రెడ్డి.

## ఓ అంతుపట్టని ప్రపంచం



**ఆది సాయికుమార్** హీరోగా నటిస్తున్న సూపర్ నాచురల్ హారర్ థ్రిల్లర్ 'శంబాల.. ఏ మిస్టిక్ వరల్డ్'. స్వాసిక హీరోయిన్. యుగంధర్ ముని దర్శకుడు. రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్‌రెడ్డి నిర్మాతలు. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ శనివారం విడుదల చేశారు. రాత్రివేళ ఓ పోలంలో ఎర్రచీర కట్టుకొని నిలబడ్డ ఓ స్త్రీ. పక్కనే దిష్టిబొమ్మ.. మరోవైపు రాత్రివేళ ఎగురుతున్న పక్షులు.. భీతిని కలిగించే వాతావరణాన్ని సూచించేలా ఈ పోస్టర్ ఉంది. ఆ పొలంలో నిలబడ్డ స్త్రీ పేరు వసంత. ఆ పాత్రనే ఇందులో కథానాయిక స్వాసిక పోషిస్తున్నది. భయంకరమైన స్వాసిక లుక్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ఆది సాయికుమార్ భౌగోళిక శాస్త్రవేత్తగా ఛాలెంజ్ రోల్ పోషిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది.

# విశ్వక్‌సేన్ ధైర్యం నచ్చింది



**'అడల్ట్ కామెడీ** అన్ని చోట్లా ఉంది. ట్విటర్ ఓపెన్ చేస్తే కనిపించేదంతా అదే. దానితో పోల్చుకుంటే మా సినిమాలో ఉన్నది చాలా తక్కువ. హీరో లేడీ క్యారెక్టర్. కొందరికి అర్థంకాని డెక్కన్ లాంగ్వేజ్ మాట్లాడటం.. ఈ కారణాల వల్ల సెన్సార్‌వారు 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చారు. నిజానికి మా సినిమాలో అడల్ట్ కామెడీ అంటూ ఏం లేదు.' అని నిర్మాత సాహు గారపాటి అన్నారు. విశ్వక్‌సేన్ కథానాయకుడిగా రామ్ నారాయణ్ దర్శకత్వంలో ఆయన నిర్మించిన రొమాంటిక్ యాక్షన్ ఎంటర్టైనర్ 'లైలా'. ఆకాంక్ష శర్మ కథానాయిక. ఈ నెల 14న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో సాహు గారపాటి విలేకరులతో ముచ్చటించారు. 'ప్రేమ నేపథ్యంలో సాగే లవ్ ఎంటర్టైనర్ ఇది. ఇలాంటి కథను ఓ హీరో యాక్సప్ట్ చేయడం నాకు బాగా నచ్చింది. లేడీ గెటప్‌లో నటించడం తేలికైన విషయం కాదు. కొందరు హీరోలు భయపడ్డారు కూడా. విశ్వక్ చేస్తానని ముందుకొచ్చాడు. 'అన్నా.. ఇది నేను చేయాల్సిన క్యారెక్టర్..' అని చెబుతూ ఇష్టంతో చేశాడు. ఫస్టాఫ్ మొత్తం సోనుగా, సెకండాఫ్‌లో లైలాగా అలరిస్తాడు విశ్వక్. ఆ రీజన్ చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. విశ్వక్ లేడీ గెటప్‌కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఫ్యామిలీ ప్రేక్షకులు కూడా ఎంజాయ్ చేసేలా దర్శకుడు రామ్‌నారాయణ్ ఈ సినిమాను మలిచాడు.' అని తెలిపారు. మే, జూన్ నెలల్లో చిరంజీవిగారి సినిమా మొదలుపెడతామని, అనిల్ రావిపూడి మార్క్‌లో పర్ఫెక్ట్ కమర్షియల్ ఎంటర్టైనర్‌గా ఆ సినిమా ఉంటుందని సాహు గారపాటి పేర్కొన్నారు.















Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.